లకు అలవాటుపడ్డ ఆడవాళ్ళ మనస్సుల్ని మార్చడం అసంభవమని అతను వెళ్ళిపోయాడు, నడిచివెళ్ళి తన వోటును పోల్‌చేసి వచ్చాడు.

వోట్ పోల్‌చేయడం 'బోర్' అని తుస్కారంగా భావించిన సువర్ణ సాయంత్రం మూడున్నరకు పెరల్‌వైట్ అమెరికన్ ప్రింటెడ్ జార్జెట్ నైలాన్ చీర ధరించి, పావుగంటసేపు అత్యాధునికంగా అలంకరణ చేసుకొని, క్లోజ్ ఫ్రెండ్ కళ్యాణితో పోలింగ్ స్టేషనుకు బయలుదేరింది, బ్లూకలర్ మారుతీ డీలక్స్ కారులో.

ఆమె ప్రవర్తన ఆశ్చర్యంగా తోచినా ఆమె 'మూడ్'ను చెడగొట్టటానికి ఇష్టంలేక చిరునవ్వు మినహా ఏమీ వ్యాఖ్యానం చేయలేదు.

సువర్ణా, కళ్యాణి—ఇద్దరూ పోలింగ్‌స్టేషన్‌కు బయల్దేరారు. కళ్యాణి బలవంతంమీదనే తన భార్య వోటు చేయడానికి సిద్ధపడిందని గ్రహించాడు ఆనంద్.

పది నిముషాల్లో ఇద్దరూ తిరిగివొచ్చారు.

హాల్లో మ్యాగజైన్ చదువుతూ సోఫాలో కూర్చునే ఉన్నాడు ఆనంద్.

“ఏమైంది? వోటు పోల్‌చేశావా సువర్ణా?”

“నేను చేశానండీ. కానీ....” అంది కళ్యాణి.

ఉప్పుమీద నిప్పుగల్లు పడ్డట్టుగా వుంది సువర్ణ మొహం. ఫారిన్ కాస్మోటిక్స్‌లో మేకప్ చేసుకున్న ఆమె మొహం ఎండదెబ్బ తగిలిన తెల్లగులాబీలా వుంది.

“డర్టీ వరల్డ్, డర్టీ పాలిటిక్స్, డర్టీ టాక్టిక్స్. ఏం డెమొక్రసీ! ఏం ప్రజలు! అంతా మోసం! దగా! వోటు వేద్దామని వెళితే నా ఓటు పొద్దునే ఎవరో వేసేశారట. వాట్ ఏ వండర్‌ఫుల్ జోక్!” అంది సువర్ణ చిటపటలాడుతూ.

“అందుకే ఉదయం పది గంటలకు వోట్ చేద్దామన్నాను. నా మాట వినిపించుకున్నావు కాదు” అన్నాడు ఆనంద్ ముసిముసిగా నవ్వుతూ.

*వోటు వేయడంలో మీ కర్తవ్యాన్ని మీరు విస్మరిస్తే మరొకరు నెరవేర్చే ప్రమాదం లేకపోలేదు.*

# అనుభూతి

“నేను చాలా అలసిపోయాను” అరవై ఏళ్ళ వయసులో కాశీవిశ్వనాధం గారు అలసటగా అనుకున్నారు. ఒక్కసారి గతాన్ని వెనక్కి తిప్పి చూసుకుంటే ఎన్ని కలల అలలు. క్షణం తీరిక లేదు. చేసిన పనీ లేదు. ఆఫీసు ఇల్లు ఈ రెండిటి మధ్యా పరుగులు.

పుట్టిన తర్వాత కొద్దికాలం బాల్యం. అదో అనుభూతి. తండ్రి లాలింపు, ఆయన ముద్దు పెట్టుకుంటున్నప్పుడు మీసాలు గుచ్చుకున్నట్లు అదో గిలిగింత. తల్లి చల్లని వెన్నెలలా చిరునవ్వు నవ్వుతూ ఉండేది. “నాయినా కాశీ” ఆవిడ పిలుపు ఎప్పుడూ ఆప్యాయతా అనురాగం మేళవించేది. కళ్ళనిండా కాటుక, పసుపు రాసిన మొహానికి నిండైన రూపాయి కాసంత కుంకుమ బొట్టు. కళగల మొహం. దయగల చూపు, గంభీరమైన ప్రవర్తన. వయసులో కూడా విశ్వగోచీ పోసి, ఏడు గజాల చీరకట్టి కాళ్ళకు కడియాలూ, గొలుసులూతో పూర్వకాలపు ముత్తయిదువ. తులసెమ్మ గారంటే అందరికీ భక్తి గౌరవం. తండ్రి పోయాడని తెలిసిన మరుక్షణం స్పృహ తప్పిందావిడకి. తరువాత కొద్దిసేపటికి కళ్ళు తెరిచి “కాశీ నాయినా కాశీ” అంది. ఆవిడ కళ్లు ఏవో చెప్పబోయాయి. చెయ్యి అతని జుట్టు నిమిరి శూన్యంలోకి చూస్తూ కళ్ళు మూసింది. ఆ మూసిన కళ్ళు మళ్ళీ విప్పలేదు.

ఈ అనుభూతికి అర్థంలేదు అనుకునే వారు కాశీ విశ్వనాధంగారు. తల్లితండ్రుల అనురాగవర్తన్యాన్ని భార్యాభర్తల సహజీవనాన్ని మరో అర్థం చెప్పింది ఆయన ఇల్లాలు. ఆవిడ కొంచెం కారం పాలు ఎక్కువ ఉన్నమనిషి. ఆయన్ని ఎప్పుడూ ఆవిడ కోరికలకే ఉపయోగించుకుంది. కాని ఆయన కోరికలెన్నడూ ఆవిడ తీర్చలేదు.

తాసీల్దారు చేసేడాయన. కాని తాసీల్దారీగిరి చేసిందావిడే. ఆయనంటే ఎవరూ గుర్తించేవారుకాదు. రావణాసురమ్మ అని నణుక్కునేవారు మహాలక్ష్మి గురించి జవాన్లు. ఓసారి ఆయనెందుకో నోరెత్తాడు. మూడురోజులు నణిగి నాలుగోరోజు నూతిలో దూకుతానని కూర్చుందావిడ. కాళ్ల పట్టుకోవడం తప్పించి మిగతా ఉపచారాలన్నీ చేశాక విరమించుకుంది. ఆనాటినుంచీ విశ్వనాధాన్ని ఒక రకమైన నిర్లిప్తత ఆవరించింది. ఆయనలో ఒక రకమైన వేదాంతభావం

రచన: నందుల వెంకటేశ్వరరావు

ఉండేది. మనిషి జీవితానికి అర్థం తెలిసేది కాదు. సుఖం శాశ్వతం కాదు అని తెలిసీ మనిషి దానివెంట ఎందుకు పరిగెడతాడో అర్థంకాని సమస్య. ఓ చదువు ఓ ఉద్యోగం, ఒక పెళ్ళి ఒక ప్రమోషను. పుత్రోదయం, పురుళ్లు, మనవలు, డబ్బు, బంగారం, తిండి. భౌతిక జీవనంలో క్షణికానందాలివన్నీ. తనలో ఒక ఎటాచ్డ్ సెప్టిక్‌లావేటరీ మోసుకెళ్ళే ఈ మనిషి సెంటువాసనల గురించి ఎలా మాట్లాడగలడు అర్థం కాని సమస్య.

కొంతకాలం సాహిత్యాన్ని, మరికొంత కాలం సంగీతాన్ని ఆరాధించారాయన. నిండు పున్నమి వెన్నెల్లో గోదావరిమధ్య ఇసుకతిన్నెలమీద చుట్టూ గోదావరి సన్నగా శబ్దించేస్తూ. పారుతున్న వేళ వేణుగానంలో మైమరచిపోయేవారాయన. కాని మళ్ళీ ఇంటికి చేరేసరికి అక్కణ్ణించి తెచ్చుకునే అనుభూతి ఆవిరైపోయింది.

మానసిక పరివర్తన లేని సమాజాన్ని అందులో భాగం అయిన భార్యాబిడ్డల్ని వింతగా చూసేవారు విశ్వనాథంగారు. మానసికంగా వికృతం అయిన అలంకారం గల భార్య గంపెడు నగలు దిగవేసుకుని శారీరకంగా అలంకరించుకుని తన్ని అలరించబోతే ఒక అస్థిపంజరం అలంకరించుకుని తన్ను స్ఫురిస్తోందన్న అనుభూతి కలిగేది ఆయనకు. తన చెడిన చెల్లెలు జీవనోపాధికి రెండు వేలు ఇద్దామని ఆలోచించి ఆ మాట చెవినవేస్తే అదేదో మహాపరాధం అయినట్లు. కొంప కొల్లేరయినట్లు, కరడుకట్టిన స్వార్థంతో, డబ్బు సంపాదన, అసూయా కార్పణ్యాలు తప్ప కారుణ్యం లేకుండా గొడవచేసే ఆవిడ్ని చూసి విస్తుపోయారాయన. ఆ రెండువేలూ పెట్టి పలకసర్లు కొనుక్కొని మెడలో దిగవేసుకున్న ఆ ఇల్లాలి యల్లో మెటల్ వ్యామోహానికి, లౌకిక జీవనానికి తన భాగస్వామి ఇచ్చే ప్రాధాన్యానికి విశ్వనాథంగారికి వైరాగ్యం కలిగింది.

వ్యక్తికి వ్యక్తిత్వానికీ ప్రాధాన్యం ఇవ్వకుండా, ఇంత అల్లరిచేసిన ఆ ఇల్లాలు మూర్ఖత్వం మౌర్ఖ్యంతో తన్ను బెదిరించి నిలవరించి తన మనసు పొందగలిగిందా. ఇంత అల్లరిచేసి ఏం పట్టికెళ్ళగలిగింది. చితిమీద ఇల్లాలిని చూసిన ఆయన కన్నీటిపొరల్లో చితిమంటల వెలుగు పరావర్తనం క్షణికమైపోయింది.

ఇదోరకమైన భావావేశం. పోయిన దుఃఖం పొంగులా వచ్చినా కాలంలో ఒక జీవి మనుగడ ఆగిపోయినా కాలం చలనం మాత్రం సాగిపోతుంది. దుఃఖం ఉధృతాన్ని కాలం జార్చేస్తుంది. జీవితం ఎడారిలో ఎన్ని అడుగులు నడిచినా వెనుతిరిగి చూస్తే జాడ తెలిపే అడుగులు అన్నీ చెరిగిపోయే ఉంటాయి. నడచిన అడుగులు బయల్దేరిన యాత్ర మొదలును చెరిపేస్తుంటే, గమ్యాన్ని చేరే ఓపికను వృద్ధాప్యం తగ్గించివేస్తుంటే ఈ జీవిత





ఎడారిలో కాలం పెనుతుపానుతో ప్రతి మనిషి గమ్యం అగమ్యం. వేసిన ప్రతి అడుగూ అదే మొదలు, అదే తుది. ఇది సృష్టి వైచిత్రి.

కొడుకులూ, కూతుళ్ళూ ఎవళ్ళ సంసారాలు వాళ్ళవి. మధ్యన తనో సన్యాసి. నలుగురు కూతుళ్ళూ, నలుగురు కొడుకులూ భార్య అభీష్టం మేరకు ఆవిడ కోరికకు అనుగుణంగా మెలిగి ఆ మేరకు కని ఇచ్చిన వానసన్యాసితను. ఆ కొడుకులూ, కూతుళ్ళూ అంతా ఆవిడ తర్ఫీదులోని కవాతు దళమే. కాని కోడళ్ళూ, అల్లుళ్ళూ పరాయి ఇంటినుంచి వచ్చారు. అందులో పెద్దకోడలిది చక్కటి మనస్తత్వం. మళ్ళీ ఆనాటి తన తల్లి తులసెమ్మే గుర్తుకువచ్చేది.

ఈ అరవైఏళ్ళ వయసు ప్రయాణంలో అలసిపోయిన కాశీవిశ్వనాధం గారికి అన్నీ వేళకు అమర్చి బాగోగులు చూసేది. ఆయన ఒంటరితనానికి స్వాంతన ఆమె చల్లటి పలుకు. ఆయన ఆధ్యాత్మిక ప్రసంగాలకీ అరవిందుల, వివేకానందుల, రామకృష్ణ పరమహంసల భాష్యాలకీ ఆవిడ శ్రోత.

ప్రశాంతంగా సాగిపోయే ఈ జీవిత గోదారి రాదారిలో కొడుకు జీవిత నౌకకు ఒక ఆశాకిరణం అందింది. ఒక పసి పాపడు ఆ ఇంట అవతరించాడు. కొత్తలో ఆ పసిపాపడి పలకరింపులూ, అలరింపులూ విశ్వనాథంగారిని ఆకర్షించలేదు. ఆయన అరవిందుల భాష్యాల మథనంలో మనసునీ, మాయాప్రపంచపు మత్తునీ క్రోడీకరించి బ్రహ్మానంద సాధనలో ఉన్నారు.

కాని కూతపట్టిన ఆ చిరువేటకాడు మాత్రం ఆయన్ని వదల్లేదు. మొట్టమొదట తతత్తాలతో మొదలైనవాడు హుషారుగా ఇల్లంతా ఒక కొలిక్కి తీసుకువస్తున్నాడు. క్షణం ఊరుకోడు. ఇంట్లో తనకి జడపదార్థంలా కనిపించే ఈ తాత వాడికి ఒక పెద్ద వినోద కేంద్రం. తాతమీదకి ఎక్కుతాడు, జారతాడు, కళ్ళజోడు పీకుతాడు, కాళ్ళ జోడ మీద మూత్రం పోస్తాడు. "ఒరేయ్‌తాతా" అని పిలుస్తాడు. ఈ అల్లరికి భయపడి కోడలు వాడ్ని కిటికీకి కట్టింది ఒకసారి. తాడు నెమ్మదిగా లాక్కుంటూ వాడు విశ్వనాథంగారి దగ్గరదాకా పాకుతూ "తాతా ఒరేయ్" అని జాలిగా పిలిచాడు. తలెత్తి చూసిన విశ్వనాథంగారికి జాలివేసింది. "ఎవరు కట్టార్రా ఈ తాడు" అంటూ విప్పదీసి తన పనిలో మునిగిపోయారాయన.

కాస్సేపయిన తర్వాత రెండు అడుగులు వేయబోయిన ఆయన బోర్లా పడిపోయారు. వాడు రహస్యంగా ఆ తాడుని విశ్వనాథంగారి పంచెకు ముడివేశాడు. ఈలోగా కోడలు వచ్చి వాడ్ని రెండు వేసింది.

ఏడుస్తున్న మనవడిని ఒక్కసారిగా చంకన వేసుకున్నారు విశ్వనాథంగారు.

"రా తాతా మనం ఆడుకుందాం" అని తోటలోకి తీసుకెళ్ళారు. తర్వాత మనవడితో ఎన్ని ఆటలు! మళ్ళీ చిన్నతనం నాటి పరుగులు, గోళీలు, గుళ్ళంచేడు, చెడుగుడు, దాగుడుమూతలు చిన్నపిల్లాడిలా ప్రవర్తించినా ఆయనలో బ్రహ్మానందం కలిగేది. ఈ బ్రహ్మానందాలు ఈ అనుభూతుల్లో ఉంచుకుని భాష్యాలు మధించడం దేనికి అనుకున్నారాయన.

"ఒరేయ్ తాతా" అంటే "ఒరేయ్ తాతా" అంటూ తిరిగే జోరులో ఉన్నట్లుండి ఒకరోజు మనవడికి విపరీతమైన జ్వరం మెదడువాపు వ్యాధిట. సాయంత్రం అయేసరికి డాక్టరు పెదవి విరిచాడు. ఆయన చెలిమి విడిచి మనవడు ప్రయాణమై వెళ్ళిపోయాడు. ఏ బ్రహ్మలోకాలు కనుక్కున్నాడో కాశీవిశ్వనాథం గారికి మనసంతా చీకటైంది. అధ్యాత్మిక చింతన ఆయన్ను ఓదార్చలేదు. బ్రహ్మానందం ఈ భూమిమీద మమతలతో నిత్యమైంది కాదు అన్న సత్యం తెలిశాక ఆయన మనసు మూగపోయింది.

మళ్ళీ ఓ ఏడాది తర్వాత ఆ ఇంట్లో నవ్వుల పువ్వులు వికసించాయి. కోడలు మనవరాల్ని ఎత్తుకుని కాశీ విశ్వనాథం గారి గదిముందు నిల్చుంది. ఆయన మనస్సు నర్థంచేసుకొన్నది ఆమె ఒక్కతే. చేతిలోని పిల్లని అర్థ్రింగా ఆయనకి అందించబోయింది. పైకి లేచి చేతులు చాచబోయిన ఆయన చేతులు ఒక్క క్షణం కంపించాయి. మళ్ళీ చేతులు వెనక్కి తీసేసుకొని "వద్దులే అమ్మా" అని మంచంమీద అటు తిరిగి పడుకున్నారాయన. •


**తెల్లమచ్చలు**

తెల్లమచ్చలు నివారింపవచ్చు. మా ఆయుర్వేద మందు ఉపయోగించటంవల్ల మచ్చల రంగులో మూడు రోజుల్లో మార్పు కనిపిస్తుంది. మరియు అది సహజమైన చర్మం రంగులోకి మారుతుంది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్ మందు ఉచితంగా ఇవ్వబడుతుంది. దయచేసి మందు కావలసినవారు వ్యాధిని తెల్పుతూ వెంటనే వ్రాయండి.

HAKIM MOULANA AZAD
P.O. LAL BIGHA (GAYA) 805 108.

**తెల్లవెంట్రుకలు నలుపు**

మా ఆయుర్వేద "జుల్ఫైన్ సుధార్" స్పెషల్ స్టాఫ్రింగ్ అయిల్ ఉపయోగించడంవల్ల తెల్లవెంట్రుకలు కుదుళ్ళనుండి నల్లబడతాయి. వెంట్రుకలు నల్లగా మారనిచో మీ సొమ్ము వాపసు యివ్వబడుతుంది. ఫుల్‌కోర్స్ వెల: 3 బాటిల్స్ రూ. 45/– మాత్రమే.

AZAD INDIA COMPANY
P.O. LAL BIGHA (GAYA) 805 108.




# కాలం కడలిలో జీవన కెరటాలు



ఎం. అరుణాచలం

వ్యక్తి పేరుకి, గుణానికి ఏ విధంగా పొంతన లేకుండా ఉంటుందో, హైదరాబాదులోని పేటల పేర్లకు, అక్కడ నివసించేవారికి కూడా ఎలాంటి సంబంధం ఉండదు. అలాంటి పేటలలో 'అమీరుపేట' ఒకటి. ఆ పేరు వినంగానే అక్కడ అందరూ అమీరులే వుంటారేమో అని అనుకోవచ్చు. కాని అక్కడ ఉండేవారందరూ అమీరులే కాదన్నది మాత్రం సత్యం. ఆ పేటలో గరీబ్‌లు ఉన్నారు. మధ్యతరగతి వారున్నారు, కొంచెం ధనవంతులు కూడా లేకపోలేదు. అడపా, తడపా అమీరులు కూడా ఉన్నారు. కొంతకాలం కిందట అక్కడ ఉండటానికి కొందరు వెనుకాడేవారు, అది ఊరికి దూరమని, బస్సు సౌకర్యాలు బాగాలేవని. ఆ పేట అవతల, చుట్టుపట్ల అనేక కాలనీలు రావటంతో, అది మంచి సెంటరయి కూర్చుంది. క్రమంగా బస్సుల రాకపోకలు కూడా